సాక్షి విశాఖపట్నం

సోమవారం । 29 । మే । 2023



**స్క్రాప్ షాప్‌లో అగ్నిప్రమాదం**

పరవాడ సమీపంలో తుక్కు దుకాణంలో ఆదివారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. 8లో




**చివరి మజిలీకి సగౌరవంగా..**

భౌతికకాయాలను ఆయా ప్రాంతాలకు తరలిస్తున్న మహాప్రస్థానం వాహనాల సేవలు ఉపయోగకరంగా మారాయి. 8లో



**భారతదేశం విజ్ఞాన నిధి**

భారతదేశం విజ్ఞానాల నిధి అని కేంద్ర విదేశీ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ విజయ్ చౌతైవాలె అన్నారు. 8లో

## న్యూస్‌రీల్

### సివిల్స్ ప్రిలిమ్స్‌కు 51.28 శాతం హాజరు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

**సీతంపేట:** సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 29 కేంద్రాలలో రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 10,864 మంది అభ్యర్థులకు గాను మొదటి సెషన్ పరీక్షకు 5,607 మంది, రెండో సెషన్ పరీక్షకు 5,536 మంది హాజరయ్యారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మొత్తంగా రెండు సెషన్లకు 51.28 శాతం పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులతో కలిసి పరిశీలించారు.

### ఐసీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్‌గా కృష్ణమాచారి



చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న కార్యవర్గ సభ్యులు

**విశాఖ విద్య:** ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ సీఎంఏ పి.బి.కృష్ణమాచారి ఎన్నికయ్యారు. విశాఖపట్నం చాప్టర్ భవనంలో ఆదివారం ఐసీఏఐ కార్యవర్గ 58 సంవత్సరాంతపు సమావేశం జరిగింది. విశాఖపట్నం చాప్టర్ కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సీఎంఏ పి.బి.కృష్ణమాచారి, వైస్ చైర్మన్‌గా సీఎంఏ ఏయు.లక్ష్మణరావు, కార్యదర్శిగా జి.రామలింగారెడ్డి, కోశాధికారిగా ఎం.హిమబిందును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా బి.సంపత్‌బాబు, వి.శాంతిశిరీష, బి.నరేంద్ర, ఎం.వెంకటేష్, ఎస్.రాజశేఖర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ 2023–24 సంవత్సరానికి పాలకవర్గంగా వ్యవహరించనుందని కార్యదర్శి సీఎంఏ రామలింగారెడ్డి తెలిపారు. ఎన్నికైన నూతన కమిటీకి విశాఖపట్నం చాప్టర్ సభ్యులు అభినందనలు తెలిపారు.

### 30 నుంచి శ్రీ సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



**అల్లిపురం:** శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం దత్తత దేవాలయం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం (అంబికాబాగ్) వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవ సంకల్పం, ధరారోహణం, 31వ తేదీన విశేష హోమాలు, శ్రీ స్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 1వ తేదీ సాయంత్రం మహాశాంతి హోమం, 2వ తేదీన వైదిక సదస్యము, తిరువీధి ఉత్సవం, 3వ తేదీన చూర్ణోత్సవం, అవభృదోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, 4వ తేదీన ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగం, పవళింపు సేవ ఉంటుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన వారు రూ.300 చెల్లించాలన్నారు.

### బీచ్ రోడ్డులో విటథాన్ రన్



రన్‌ను ప్రారంభిస్తున్న సుదీక్ష

**బీచ్‌రోడ్డు:** రెటినా బ్లాస్టోమా కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో విటథాన్ రన్ నిర్వహించారు. 10,5,3 కిలోమీటర్ల కేటగిరీలో రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని రెటీనా బ్లాస్టోమా కంటి క్యాన్సర్‌ను జయించిన బేబీ కోడెల సుదీక్ష జెండా ఊపి ప్రారంభించారు. ఈ క్యాన్సర్ వ్యాధి సోకిన రోగులకు ఉచితంగా చికిత్స అందించేందుకు నిధుల సేకరణలో భాగంగా ఈ రన్‌ను నిర్వహించినట్టు ఆస్పత్రి హెడ్ డాక్టర్ భవిక్ పంచాల్ తెలిపారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించగలిగితే పిల్లల జీవితాన్ని, కంటిని కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కంటి క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ నేహా ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక బైపాస్‌కి బైబై..!

- గోపాలపట్నంలో థర్డ్, ఫోర్త్ లైన్లకు రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్
- 15.31 కిలోమీటర్ల మేర రూ.159.47 కోట్లతో మూడో లైన్
- 8 కి.మీ పొడవుతో 3వ లైన్, 7.31 కిమీ పొడవున నాల్గో లైన్ నిర్మాణం
- ఔటర్‌లో గంటల తరబడి ప్లాట్‌ఫారం కోసం ఎదురుచూపులకు చెక్



**సాక్షి, విశాఖపట్నం :** విశాఖ ఔటర్‌కి వచ్చినా.. స్టేషన్‌కు రైలు చేరే సరికి అరగంట సమయం పడుతోంది. కారణం విశాఖ రైల్వే స్టేషన్‌పై ట్రాఫిక్ పెరుగుతుండడమే. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించిన రైల్వే అధికార యంత్రాంగం.. సింహాచలం వద్ద ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మూడు, నాలుగు లైన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. వాస్తవానికి 3వ లైన్ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపి ఏడేళ్లు కావచ్చినా.. పట్టాలెక్కేందుకు ఇప్పుడు మార్గం సుగమమైంది. ఈ రెండు లైన్లు పూర్తయితే విశాఖపట్నం రాకుండానే బైపాస్ మీదుగా రైళ్ల రాకపోకలకు చెక్ పడే అవకాశం ఉంది.

విశాఖ రైల్వే స్టేషన్‌పై భారం తగ్గాలంటే ప్రత్యామ్నాయ పరిస్థితులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వాల్తేరు స్టేషన్ నుంచి ముందుకెళ్లే పరిస్థితి లేదు. అక్కడ సాగరతీరం ఉంటుంది. కాబట్టి స్టేషన్‌కు వచ్చిన రైలు తిరిగి వెనక్కు వెళ్లాలంటే ఇంజిన్ తిరిగి వెనక్కు రావాల్సిందే. అందువల్ల రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఏ రైలైనా తిరిగి వెళ్లాలంటే కనీసం 20 నుంచి 30 నిమిషాలు పడుతోంది. ఈ ట్రైన్ కదిలిన తర్వాతే ఆ ప్లాట్‌ఫారంపైకి మరో రైలు రావాల్సిన పరిస్థితి. ప్లాట్‌ఫారంలు ఖాళీగా లేని కారణంగా విశాఖ వచ్చే రైళ్లన్నీ ఔటర్‌లోనే ఉండిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కరించేందుకు డీపీఆర్ సిద్ధం చేశారు. శివారులో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా మూడో లైన్ ఏర్పాటు చేస్తామని రైల్వే బోర్డు ప్రకటించింది. **మూడో లైన్ పూర్తయ్యాక నాలుగోలైన్ కూడా నిర్మాణం చేపడతామని స్పష్టం చేసింది. విశాఖ నుంచి గోపాలపట్నం వరకూ సుమారు 8 కి.మీ మేర థర్డ్ రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని 2015–16లో** నిర్ణయించారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో థర్డ్‌లైన్‌పై సర్వే చేసేందుకు నిధులు మంజూరు చేశారు. నిధుల రాక ఆలస్యం కావడంతో సర్వే ఏళ్ల తరబడి సాగింది. 2019–20లో సర్వే పూర్తయింది. దీని ప్రకారం అత్యాధునిక థర్డ్ లైన్, ఫోర్త్‌లైన్ ఏర్పాటు కోసం రూ.159 కోట్లు ఖర్చవుతుందని రైల్వే బోర్డు ప్రకటించింది.

**నిధులు మంజూరుతో చిగురించిన ఆశలు..**

మూడోలైన్, నాలుగో లైన్ నిర్మాణ పనుల ప్రాంతంలో పూర్తి స్థాయిలో ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి తోడు లైన్ విద్యుదీకరణ చేపట్టాలని భావిస్తున్నారు. థర్డ్‌లైన్ సుమారు 8 కిలోమీటర్లు, ఫోర్త్‌లైన్ దాదాపు 7.31 కిలోమీటర్లు చొప్పున మొత్తం 15.31 కిమీ మేర చేపట్టనున్న ఈ లైన్ల నిర్మాణానికి రూ.159.47 కోట్లు మంజూరు చేసింది. నిధుల రాకతో టెండర్లకు సంబంధించిన ప్రక్రియలో వాల్తేరు డివిజన్ అధికారులు నిమగ్నమయ్యారు.

### రాకపోకలకు ఆటంకం కలగకుండా..

ఈ రెండు లైన్లు పనులు పూర్తయితే ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా రాకపోకలు సాగించగలరు. విశాఖ–దువ్వాడ–సింహాచలం మధ్య రైళ్లను త్వరగా పంపించేందుకు వీలవుతుంది. అదేవిధంగా విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రైళ్ల రాకపోకల్లో వేగం పెంచే అవకాశమూ కలుగుతుంది. ఇప్పటికే సింహాచలం–గోపాలపట్నం– విశాఖపట్నంతో పాటు దువ్వాడ–గోపాలపట్నం మధ్య ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మూడు, నాలుగో రైల్వే లైన్లు కూడా పూర్తయితే..



ఔటర్‌లో గంటల తరబడి రైళ్లు ఆగాల్సిన అవసరం ఉండదని.. వీలైనంత త్వరగా థర్డ్ అండ్ ఫోర్త్ లైన్ పనులు ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### సమగ్ర నివేదిక సిద్ధం



థర్డ్, ఫోర్త్ లైన్ల నిర్మాణానికి రైల్వే బోర్డు నిధులు మంజూరు చేయడం ప్రయాణికులకే కాదు వాల్తేరు డివిజన్‌కు శుభవార్తే. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం. ఈ ప్రాజెక్టుల వల్ల వాల్తేరు డివిజన్ పరిధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా రైళ్ల రాకపోకల వేగం పెరుగుతుంది. ముఖ్యంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారంల రద్దీ తగ్గుతుంది.

ఫలితంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం సమగ్ర నివేదిక సిద్ధమవుతోంది. త్వరలోనే టెండర్ల ప్రక్రియకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

**– అనూప్ కుమార్ సత్పతి,**
వాల్తేరు డీఆర్‌ఎం

### ఇద్దరు తహసీల్దార్ల బదిలీ

**సాక్షి, విశాఖపట్నం:** జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ డా.మల్లికార్జున ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఈర్ల శ్యామ్ ప్రసాద్‌ని పెందుర్తి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సీతమ్మధార అర్బన్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. సోమవారం ఆయా కార్యాలయాల్లో తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టనున్నారు. ముదపాక భూముల వ్యవహారంలో ఆనంద్‌కుమార్ సక్రమంగా వ్యవహరించలేదన్న ఆరోపణలతోనే బదిలీ అయ్యారన్న ప్రచారం సాగుతోంది. ఈ భూముల వ్యవహారంలో కలెక్టర్ మల్లికార్జున హైకోర్టు నుంచి నోటీసులు కూడా అందుకున్న సంగతి తెలిసిందే.

### గురుకులాల ఉపాధ్యాయుల బదిలీకి ఉత్తర్వులు

**కంచరపాలెం:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లోని ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ లెక్చరర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు, ట్రైనీ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు, స్పెషల్ టీచర్స్ (వ్యాయామ ఉపాధ్యాయులు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, హెల్త్ సూపర్‌వైజర్లు), సీనియర్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఈ నెల 30, 31వ తేదీల్లో విశాఖ జిల్లా మేఘాద్రిగెడ్డ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులు పీజీకి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌కి హాజరుకావాలని ఆమె కోరారు.

# జనసేన నేతల వీరంగం



సత్యం జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించిన జనసేన నేతలు



సీఐ సింహాద్రినాయుడుకి జనసేన నేతలపై ఫిర్యాదు చేస్తున్న కేకేరాజు, పార్టీ నేతలు

- సీఎం జగన్ ఫ్లెక్సీలు చించివేత
- సత్యం జంక్షన్ వద్ద, ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయింపు
- జనసేన నేతల తీరుపై ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో కేకే రాజు ఫిర్యాదు

**సీతమ్మధార:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీలు చించివేసిన జనసేన నాయకులు సత్యం జంక్షన్ వద్ద వీరంగం సృష్టించారు. రోడ్డు మధ్యలో బైఠాయించి వాహనదారులకు ఇబ్బందులు కలిగించారు. అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. కొంతమంది మద్యం సేవించి ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద హంగామా చేశారు. తిరిగి వైఎస్సార్ సీపీ నాయకులపై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి ఫ్లెక్సీలు చించివేతపై నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, శశికళ, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పీలా వెంకటలక్ష్మి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఆళ్ల శ్రీనివాస రావు, వార్డు అధ్యక్షులు నీలి రవి, సత్యనారాయణ తదితరులు ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలోను కొంత మంది జనసేన నాయకులు మద్యం సేవించి నానా హంగామా సృష్టించారు. దీంతో ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురిని, ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తరువాత స్టేషన్ బెయిల్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితిని ప్రతిబింబించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జనసేన నేతలు ఎందుకు ఉలిక్కిపడుతున్నారన్నారు. సీఎం జగన్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి టీడీపీ, జనసేన నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో జనసేన నేతలు విధ్వంసానికి పాల్పడుతున్నారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన జనసేన నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# బదిలీలపై ముమ్మర కసరత్తు..!

- ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలు విడుదల
- 17 దరఖాస్తుల తిరస్కరణ
- స్పౌజ్, మెడికల్ సర్టిఫికెట్లపై మరోదఫా పరిశీలన
- 6,071 దరఖాస్తులకు ఆమోదం

**విశాఖ విద్య:** ఉపాధ్యాయుల బదిలీలపై విద్యాశాఖాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వివిధ కేడర్లకు చెందిన 6,088 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలన మేరకు 17 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.లక్ష్మణరావు ఆదివారం వెల్లడించారు. దీంతో 6,071 దరఖాస్తులకు ఆమోదం లభించింది. కొంతమంది దరఖాస్తులను ఉపసంహరించుకోగా, మరికొంతమంది ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని వాటిని తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. కొన్ని కేడర్లకు సంబంధించిన ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను ఆదివారం ప్రకటించారు. సోమవారం నాటికి పూర్తి స్థాయిలో అన్ని కేడర్ల సీనియార్టీ జాబితాలు ప్రదర్శించేలా విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

**ఎస్.రాయవరం నుంచి అత్యధికం**

ఉపాధ్యాయులకు మేలు చేయాలనే ఉద్దేశంతో జీరో సర్వీసుతో బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువగానే దరఖాస్తులు వచ్చాయి. సొంత గ్రామాలు, వాటికి సమీప పాఠశాలల్లో చోటు దక్కించుకోవడం కోసం ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం నుంచి అత్యధికంగా 258 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత స్థానంలో నక్కపల్లి మండలం నుంచి 251 దరఖాస్తులు అందాయి. కాగా విశాఖపట్నం అర్బన్ నుంచి అత్యల్పంగా కేవలం 16 మంది మాత్రమే బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా పెదగంట్యాడ మండలం నుంచి 58, గాజువాక – 71, సబ్బవరం – 78, పెందుర్తి – 82 మంది దరఖాస్తు చేసుకున్నారు. విశాఖపట్నం నగరానికి సమీపాన ఉండడంతో ఇక్కడి నుంచి వేరేచోటకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి కనబరచలేదు.

**తప్పిదాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు**

ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలపై ఈ నెల 30న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలు పరిశీలించి, వాటిని పరిష్కరిస్తారు. ఈ ప్రక్రియే కీలకం కానుంది. ఈ ఏడాది జనవరిలో బదిలీల ప్రక్రియ నిర్వహించగా, కోర్టు కేసుల కారణాలతో దానిని రద్దు చేశారు. అయితే ఆ సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది ఉపాధ్యాయులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు తేలింది. స్పౌజ్, మెడికల్ సర్టిఫికెట్లు సమగ్ర పరిశీలనతో ఇది వెలుగులోకి వచ్చింది. ఇలాంటి వాటిని కట్టడి చేసే క్రమంలోనే ఈ సారి బదిలీల ఉత్తర్వుల్లోనే స్పష్టమైన విధి విధానాలను ఉన్నతాధికారులు వెల్లడించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టిన వారికి మూడు ఇంక్రిమెంట్లు కోత పెట్టడటంతోపాటు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసారి ఎంతమంది అయ్యవార్లు అడ్డదారులు తొక్కారనేది అభ్యంతరాల పరిశీలన అనంతరం తేలనుంది.

**1,997 మందికి తప్పనిసరి బదిలీ**

ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న హెచ్‌ఎం, 8 ఏళ్లు పూర్తయిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో గ్రేడ్ – 2 హెచ్‌ఎం – 105 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు – 1,394 మంది, స్కూల్ అసిస్టెంట్లు – 498 మంది ఉన్నట్లు లెక్క తేల్చారు. వీరంతా ప్రస్తుతం పనిచేస్తున్న చోట నుంచి తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే.

# డిప్యుటేషన్లతో నింపేశారు..

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో లెక్కకు మించిన ఉద్యోగులు
- ఇక్కడ హాజరు వేసుకొని ఇతర పనుల్లో బిజీ
- ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా డిప్యుటేషన్లు రద్దు చేయని అధికారులు



**మహారాణిపేట:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల డిప్యుటేషన్లు అక్రమాలకు కేంద్రంగా మారుతున్నాయి. కొద్దిగా పలుకుబడి, పైసలు ఇచ్చుకొని ఇక్కడ పనిచేయడానికి డిప్యుటేషన్ల ఆర్డర్ సులువుగా తెచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారం అంతా స్థానిక సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇక్కడ ఉద్యోగంలో చేరిన తరువాత విధులకు హాజరుకాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కార్యాలయంలో ఆధార్ ఎనబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్(ఏఈబీఏఎస్), ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్(ఎస్‌ఆర్‌ఎస్) ద్వారా హాజరువేసుకొని సొంత పనుల నిమిత్తం బయటకు ఎంచక్కా వెళ్లిపోతున్నారని సమాచారం. అందువల్లే పలు ప్రాంతాలకు బదిలీ అయినవారు, నగరంలో ఉండాలనుకునేవారు లంచాలు ఇచ్చి మరీ డిప్యుటేషన్ ఆర్డర్లు తెచ్చుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది తొమ్మిది మంది అవసరం ఉంది. కానీ ఇక్కడ మరో పది మంది ఉద్యోగులు డిప్యుటేషన్ మీద పనిచేస్తున్నారు. నలుగురు ఎంపీహెచ్ ఈవో(మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు), ఇద్దరు హెల్త్ సూపర్‌వైజర్లు, ముగ్గురు గుమాస్తాలు, అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి ఒకరు డిప్యుటేషన్లు పనిచేస్తున్నారు.

**డిప్యుటేషన్లు వద్దన్నా :** ప్రభుత్వ శాఖల్లో ఎలాంటి డిప్యుటేషన్లు వేయవద్దని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్ల పర్వం కొనసాగుతోంది. ఎంపీహెచ్‌ఈవోలు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఎంతో అవసరం ఉంది. వీరు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేయాల్సి ఉంది. మ్యాపింగ్ కూడా చేశారు. అయినా నలుగురు డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఉన్న హెల్త్ సూపర్‌వైజర్లు కూడా డీఎంహెచ్‌వో కార్యాలయానికి డిప్యుటేషన్లపై వచ్చేశారు.

### త్వరలో డిప్యుటేషన్లు రద్దు చేస్తా



ప్రస్తుతం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది అంతా నేను డీఎంహెచ్‌వోగా రాక ముందు నుంచి ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉద్యోగులకు సంబంధించి కోర్టు కేసులు, ప్రొబిషన్ డిక్లర్ చేయడం తదితర పనులన్నీ డీఎంహెచ్‌వో కార్యాలయం చూడాల్సి వస్తోంది. ఎంత మంది డిప్యుటేషన్ మీద పనిచేస్తున్నారో తెలుసుకొని త్వరలోని వాటిని రద్దు చేస్తాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

# ఓపీ.. హ్యాపీ

పేదలకు ఏ విధంగా సేవ చేయాలి.. వారికి ఎలా మంచి చేయాలని ఆలోచించే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో అరుదైన సేవా విధానాన్ని పేద రోగుల అందుబాటులోకి తీసుకొచ్చింది. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలల్లో సాయంత్రం ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వల్ల రోగులు ఉదయం ఓపీ చీటీ రాయించుకుని, వైద్యులకు చూపించుకుని, పరీక్షల అనంతరం సాయంత్రం మళ్లీ అదే వైద్యుల ద్వారా నిర్దేశించిన మందులతో ఇంటికి చేరుకుంటున్నారు. పనులన్నీ ఒకే రోజు పూర్తి కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేదలంటే ఈ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను వేనోళ్ల కొనియాడుతున్నారు.

- కేజీహెచ్, విక్టోరియా, ప్రాంతీయ నేత్ర ఆస్పత్రుల్లో సాయంత్రం ఓపీ
- రోగులకు సంతృప్తికర సేవలు
- వివిధ పరీక్షల రిపోర్టులు అదే యూనిట్ వైద్యుల పరిశీలన



కేజీహెచ్

**మహారాణిపేట :** కింగ్ జార్జి ఆస్పత్రిలో ఇప్పుడు ఈవినింగ్ అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం ఓపీ టికెట్ తీసుకుని, వైద్యులకు చూపించే సరికి ఒక పూట గడిచిపోతుంది. వైద్యుల సూచన మేరకు వివిధ పరీక్షలు చేయించుకునే సరికి మధ్యాహ్నం అవుతుంది. దాంతో సంబంధిత వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. మళ్లీ అదే యూనిట్ ఓపీ వచ్చే సరికి వారం రోజులు పడుతుంది. ఇంతలో రోగం ముదిరిపోయి పరిస్థితులు దిగజారిపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం సాయంత్రం ఓపీ సేవలను అందుబాటులోకి తేవడం తమకెంతో మేలు చేస్తుందని పేదలంటున్నారు. ఉదయం ఏ యూనిట్ ఓపీ నిర్వహిస్తుందో.. సాయంత్రం కూడా అదే యూనిట్ వైద్యులు ఓపీ సేవలకు అందుబాటులో ఉంటున్నారు. ఈ నెల 17 నుంచి ఈ సేవలను అమలులోకి తెచ్చింది. గైనిక్, డెర్మటాలజీ, మెడిసిన్, సర్జన్స్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ విభాగాల ఓపీలు ఈ సేవలందిస్తాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. ఇటీవల అమరావతిలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో ఈవినింగ్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. ఈ ప్రకారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బోధనాస్పత్రుల్లో అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**ప్రభుత్వ ఘోషాస్పత్రిలో..**

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ ఘోష (విక్టోరియా) ఆస్పత్రిలో కూడా సాయంత్రం వేళ ఓపీ సేవలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది ఓపీ సేవలందిస్తున్నారు. సిబ్బందికి డ్యూటీల్లో మార్పులు చేశారు. ప్రతి రోజు విజిహెచ్‌లో జరిగే ఓపీల్లో వైద్యులు రాసిన వివిధ పరీక్ష రిపోర్టును సాయంత్రం ఓపీ సమయంలో వైద్యులు పరిశీలించి మందులు రాయడానికి వీలు కలుగుతుంది. ఉదయం ఓపీలను, పాత ఓపీ టికెట్ కలిగిన వారికి మాత్రమే సాయంత్రం పూట వైద్యం అందిస్తున్నట్టు సూపరింటిండెంట్ డాక్టర్ పి.ఉషా రాణి తెలిపారు. ఆస్పత్రికి గర్భిణులు,బాలింతల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి. రోజూ ఓపీకి 125 నుంచి 150 వరకు బాలింతలు,గర్భిణులు వస్తుంటారు. బుధవారం, శుక్రవారాల్లో 300 నుంచి 400 వరకు వస్తున్నారు.

**ప్రభుత్వ నేత్ర వైద్యశాలలో..**

రామాటాకీస్ రోడ్డును ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఈవినింగ్ ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి.

రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఆ రోజు ఏ యూనిట్ వైద్యులు ఉంటారో అదే యూనిట్ వైద్యులు సాయంత్రం ఓపీ సేవలు అందిస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయింది



ద్విచక్రవాహనం మీద వెళ్తున్న నన్ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడమ కాలు విరిగిపోయింది. ప్రమాదం జరిగిన కొద్ది రోజుల తర్వాత కేజీహెచ్ వైద్యులను సంప్రదించాను. వారు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇప్పుడు రాడ్డు తొలగించవలసి ఉంది. దాని కోసం ఈ రోజు సాయంత్రం ఓపీకి వచ్చాను. వైద్యులు బాగా చూశారు. **–కిల్లో మోహనరావు,**
తలబిరడ, ముంచంగిపుట్టు మండలం, ఏఎస్ఆర్ జిల్లా

### గాయమైతే చూపించా..



రెండున్నరేళ్ల నా కుమారుడు జశ్వంత్ రోడ్డు మీద పడిపోయాడు. చేయి వాచిపోయింది. వైద్యులకు చూపించాను. ఎక్స్‌రే రాశారు. సాయంత్రం ఓపీలో చూపించడానికి వచ్చాను. కట్టు కట్టాలని చెప్పారు. ఒడిశా నుంచి చుట్టం చూపునకు వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

**– చంటిబాబు, ఒడిశా**

## పోలీసుల అదుపులో సైబర్ ముఠా

**అల్లిపురం:** ఓఎల్ఎక్స్ యాప్‌లో సీఐఎస్ఎఫ్ వ్యక్తులుగా పరిచయం పెంచుకొని వివాహిత వద్ద నుంచి రూ.83 వేలు ఆన్‌లైన్‌లో కాజేసిన నిందితులను నగర సైబర్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు సిబ్బందితో కూడిన బృందం ఢిల్లీ, హర్యానా, రాజస్తాన్ ప్రాంతాల్లో పర్యటించి ఓఎల్ఎక్స్ సైబర్ నేరగాళ్ల ముఠాలో ఇద్దరిని అరెస్ట్ చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై తదుపరి విచారణ నిమిత్తం విశాఖ తీసుకువస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలో ఓ వివాహిత సెకండ్ హ్యాండ్ ఫర్నీచర్ కొనుగోలు నిమిత్తం ఓఎల్ఎక్స్ యాప్‌లో వెతుకుతుండగా కొన్ని వస్తువులు కనిపించాయి. ఆ యాడ్‌లో ఉన్న ఫోన్ నంబర్‌ను సంప్రదించగా ఒక వ్యక్తి తన పేరు ప్రమోద్‌కుమార్ అని, తాను సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగి అని పరిచయం చేసుకున్నాడు. తన అకౌంట్ నంబరు ఇచ్చి ముందుగా రూ.12,600 పంపించమని చెప్పాడు. తరువాత అవి ఆర్మీ స్టోర్ నుంచి రిలీజ్ చేయాలని జీఎస్టీ, ఇన్సూరెన్స్ కట్టాలని రూ.83 వేలు కాజేశాడు. దీంతో బాధితురాలు తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ అకౌంట్లను పరిశీలించి నిందితుడు హర్యానాకు చెందినవాడిగా గుర్తించారు.

నగర శాంతిభద్రతల డీసీపీ-1, విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో ఆరుగురు సభ్యులు హర్యానా వెళ్లారు. హర్యానాలో రుంధి, గగర్వాన్ బల్దియెబాస్, కేహెచ్ఓ హెచ్ పోలీస్ స్టేషన్‌పరిధిలో పరిధిలో రిజ్వాన్, ముబారిక్, సలీమ్, తోఫిక్‌లను అదుపులోకి తీసుకున్నారు. అక్కడ చాలా మంది యువతను ఉపయోగించుకుని ఓఎల్ఎక్స్‌లో భారీగా దోచుకుంటున్నారని విచారణలో వెల్లడైంది. భరత్‌పూర్ ఎస్పీతో డీసీపీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడి కేసు విషయంలో విశాఖ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ నెల 24వ తేదీన అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్ పై ఇద్దరిని విశాఖ తీసుకువస్తున్నామని పోలీసులు తెలిపారు.

## నేడు జీవీఎంసీ స్పందన

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

## నేడు డయల్ యువర్ ఆర్డీవో

**మహారాణిపేట:** డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ చెప్పారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. 0891-2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చునన్నారు.

# చివరి మజిలీకి సగౌరవంగా..

### విశేషంగా మహాప్రస్థానం సేవలు

**బతుకు ఎలా ఉన్నా.. చావు హీనం కారాదు. కాయం కాటికి చేర్చేందుకు భారమవరాదు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందే వారి భౌతికకాయాలను తరలిస్తున్న మహాప్రస్థానం వాహనాల సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. మృతుల కుటుంబ సభ్యులు రూపాయి చెల్లించకుండా ఈ సేవలు పొందే అవకాశం ఉంది. మృతదేహాలను గౌరవప్రదంగా ఆయా కుటుంబ సభ్యులకు అప్పగించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన దిగ్విజయంగా అమలు జరుగుతోంది. కేజీహెచ్‌లో ఈ సేవలు నిరంతరం అందుతున్నాయి.**



**విశాఖపట్నం డెస్క్ :** కేజీహెచ్‌లో రోజూ చికిత్స పొందుతూ, ప్రమాదాల బారినపడి కనీసం పది నుంచి ఇరవై మంది వరకు చనిపోతుంటారు. వీరి మృతదేహాలను మహాప్రస్థానం వాహనాల్లో తరలిస్తుంటారు. నగర పరిధిలో అయితే గంట నుంచి రెండు గంటలు సమయం పడుతుంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే రోజుకు ఒక మృతదేహాన్ని మాత్రమే తరలించడం సాధ్యపడుతుంది. ప్రస్తుతం ఉన్న ఏడు మహా ప్రస్థానం వాహనాలు సరిపోవట్లేదు. అదనపు వాహనాల కోసం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కసరత్తు చేశారు. హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలుకు టెండర్లు పిలిచారు. దీంతో కేజీహెచ్‌కు మరో పది మహా ప్రస్థానం వాహనాలు సమకూరనున్నాయి. ప్రస్తుతం గిరిజన ప్రాంతాలకు మృతదేహాల తరలింపునకు కేజీహెచ్ అధికారులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో 100 కిలోమీటర్ల వరకు అని నిబంధన ఉండేది.. ఇప్పుడు ఎక్కడికైనా.. ఎంత దూరమైనా ఉచితంగా మృతదేహాలను తరలిస్తున్నారు.

**మృతదేహాలకూ హక్కులుంటాయ్!**

చనిపోయిన వ్యక్తుల హక్కుల గురించి దేశంలో ప్రత్యేకమైన చట్టాలు లేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రకారం మృతదేహాలకు కూడా మానవ హక్కులు వర్తిస్తాయని ఆయా సందర్భాల్లో కోర్టులు తీర్పులిచ్చాయి. 1989 నాటి ప్రేమానంద్ కటారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఇలాగే తీర్పిచ్చింది. ఆ తరువాత అలహాబాద్ హైకోర్టు, మద్రాస్ హైకోర్టు, తెలంగాణ హైకోర్టులు కూడా ఆయా సందర్భాల్లో మృత దేహాల హక్కులు కాపాడాలంటూ ఆదేశించాయి. ప్రధానంగా కోవిడ్ సెకండ్ వేవ్ సమయంలో మృతదేహాల హక్కుల మీద చర్చ జరిగింది. చనిపోయిన వారిని తరలించడానికి అంబులెన్సులు దొరకకపోవడం, శ్మశానాల్లో ఖాళీ లేకపోవడం, గంగానదిలో శవాలు తేలడం వంటి సంఘటనల మధ్య మృతదేహాల హక్కులు కాపాడాలంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

**ఎన్‌హెచ్ఆర్సీ జారీ చేసిన మార్గదర్శకాలు**

- కుటుంబ సభ్యులు అడిగితే మృతదేహాన్ని తరలించేందుకు స్థానిక అధికారులు రవాణా సౌకర్యం కల్పించాలి.
- బంధువులకు మృతదేహాన్ని గౌరవంగా అప్పగించాలి.
- మృతదేహాల విషయంలో మతం, కులం, ప్రాంతం, లింగ వివక్ష చూపరాదు.

### ఉచిత సేవలు ఎలా పొందాలి?

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల ప్రాంగణంలో మహాప్రస్థానం వాహనాలుంటాయి. సేవలు అవసరమైనప్పుడు వార్డు ఇన్‌చార్జికి సమాచారం ఇస్తే వారు మహాప్రస్థానం వాహనాలను రప్పిస్తారు. కేజీహెచ్‌లో ఈ వాహనాలు గతంలో భావనగర్ వార్డు పక్కన ఉండేవి. పలువురి విన్నపం మేరకు ప్రస్తుతం మార్చురీ వద్ద ఉంచుతున్నారు. సత్యసాయి ట్రస్ట్‌కు చెందిన మహాప్రస్థానం వాహనం కోసం ట్రస్ట్ కోఆర్డినేటర్‌కు 9885129654 ఫోన్ చేయాలి.

### ప్రైవేట్ ఆస్పత్రిలో చనిపోతే?

ప్రైవేట్ ఆస్పత్రిలో చనిపోతే మహాప్రస్థానం వాహనాల సేవలు అందవు. వారు ప్రైవేట్ అంబులెన్సుల్ని ఆశ్రయించాల్సిందే. ప్రైవేట్ అంబులెన్సుల నిర్వాహకులు నగర పరిధిలో అయితే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, గ్రామీణ జిల్లాకు అయితే దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

**కేజీహెచ్ నుంచి తరలించిన మృతదేహాలు**

| నెల | సంఖ్య | నెల | సంఖ్య |
|---|---|---|---|
| జనవరి | 380 | మార్చి | 410 |
| ఫిబ్రవరి | 400 | ఏప్రిల్ | 428 |

మహాప్రస్థానం వాహనాల సంఖ్య **6** | సత్యసాయి ట్రస్ట్ వాహనం **1**

రోజుకు తరలించే మృతదేహాలు **10 నుంచి 15**

నెలలో తరలించేవి **300 నుంచి 400**

### సేవలు లభించకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

మహాప్రస్థానం వాహనాల సేవలు పూర్తిగా ఉచితం. ఎవరైనా డబ్బు డిమాండ్ చేసినా మృత దేహాన్ని తరలించడానికి నిరాకరించినా సంబంధిత ఆస్పత్రి సూపరింటెండెంట్/జిల్లా కలెక్టర్/జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయవచ్చు. కేజీహెచ్ సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవకు 92466 71226 నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

### దరఖాస్తు చేస్తే కేటాయింపు



మహా ప్రస్థానం వాహనాలు కావాల్సిన వారు సీఎస్ఆర్ఎంవోను సంప్రదించాలి. పూర్తి వివరాలతో దరఖాస్తు పూర్తిచేసి కార్యాలయంలో అందజేయాలి. దరఖాస్తు పరిశీలించిన తరువాత మహాప్రస్థానం వాహనాలను కేటాయిస్తాం. ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ వాసుదేవ, సీఎస్ఆర్ఎంవో, కేజీహెచ్

### దేవుడు కల్పించిన అవకాశం



రాత్రి పగలు అనేది లేకుండా ఎప్పుడైనా ఎక్కడకైనా వెళ్లాం. కొన్నిసార్లు ఏజెన్సీ ప్రాంతాల్లో మారుమూల ప్రాంతాలకు, రహదారుల కూడా సరిగా లేనిప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మృతుల బంధువుల తోడు తీసుకుంటాను. అయినా అది నాకు పెద్ద కష్టం అనిపించదు. ఎందుకంటే కుటుంబంలో ఓ వ్యక్తిని కోల్పోయి బాధలో ఉన్నవారికి సహాయం చేయడం బాధ్యతగా అనిపిస్తోంది. ఇది దేవుడు నాకు కల్పించిన అవకాశంగా భావిస్తాను.

– కోరాడ స్వామి, మహా ప్రస్థానం వాహనం డ్రైవర్

### ఉత్తరాంధ్ర అంతా వెళ్తాం..



ఒక వాహనంలో నగర పరిధిలో అయితే రోజుకు 3 నుంచి 4 మృతదేహాలను తరలిస్తుంటారు. ఏజెన్సీలో అయితే వెళ్లొచ్చేసరికి సమయం పడుతోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధ రాత్రి సమయంలో చనిపోతే మృతదేహాలను ఫ్రిజర్‌లో పెట్టి ఉదయం పంపిస్తుంటాం. కిలోమీటర్ల నిబంధనలు ఏమి లేకుండా ఉత్తరాంధ్రలో అన్ని ప్రాంతాలకు మృతదేహాలను తరలిస్తుంటాం. అనాథ శవాలను నిబంధనల మేరకు జ్ఞానాపురం శ్మశానవాటికకు తరలిస్తుంటాం.

– రొంగలి పైడయ్య, మహాప్రస్థానం లైజనింగ్ ఆఫీసర్

# తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం

- లక్షల్లో ఆస్తి నష్టం
- నిబంధనలకు విరుద్ధంగా స్క్రాప్ దుకాణం నిర్వహణ
- విచారణ జరుపుతామన్న పోలీసులు



తుక్కు దుకాణంలో ఎగసిపడుతున్న అగ్నికీలలు

**పరవాడ :** పరవాడ సమీపంలో బ్యాంకు కాలనీ వద్ద ఏపీఐఐసీ స్థలంలో నడుపుతున్న తుక్కు దుకాణంలో ఆదివారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నావిద్‌బాయ్ 15 ఏళ్లుగా పరవాడ సమీపంలోని బ్యాంకు కాలనీ వద్ద గల ఏపీఐఐసీకి చెందిన స్థలంలో తుక్కు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జాము 3.30 గంటల సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పంటుకొని భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తుక్కు దుకాణంలో ఓ షెడ్డుకు అమర్చిన విద్యుత్ వైరింగ్‌లో లూజు కాంటాక్టు వల్ల షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రమాదంలో లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని ప్రాథమిక అంచనా. ప్రమాదాన్ని గుర్తించి కార్మికులు అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించడంతో వారొచ్చి మంటలను అదుపు చేశారు. అనకాపల్లి జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.లక్ష్మణమూర్తి, సహాయ అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావులు ఘటన స్థలాన్ని సందర్శించారు. ఫార్మా పరిశ్రమల నుంచి సేకరించిన ప్లాస్టిక్, రసాయనిక వ్యర్థాలు కావడంతో మంటలు అదుపు చేయడం భారంగా మారింది. రోజంతా శ్రమించి మంటలను ఆదివారం సాయంత్రంనాటికి అదుపులోకి తెచ్చారు. ఎటువంటి అనుమతులు లేకుండా తుక్కు దుకాణం నడుపుతున్నాడని, కేసు నమోదు చేసి విచారణ చేయనున్నట్టు పరవాడ సీఐ ఈశ్వరరావు చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తుక్కు దుకాణం యజమానిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాద వివరాలను పరవాడ తహసీల్దార్ వి.ప్రకాశరావు, పీసీబీ అధికారులు తెలుసుకొని జిల్లా అధికారులకు నివేదించారు.

## భారతదేశం విజ్ఞానాల నిధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రతినిధులు

**కొమ్మాది :** భారతదేశం విజ్ఞానాల నిధి అని కేంద్ర విదేశీ వ్యవహారాల ఇన్‌చార్జి డా.విజయ్ చౌతైవాలె అన్నారు. బీచ్ రోడ్డులో గల రాడిసన్ బ్లూలో రెండు రోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ ఆవిష్కరణ సృజనాత్మక సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. కోవిడ్ మహమ్మారికి వ్యాక్సిన్ కనుక్కోవడం, యూపీఐ (యునిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) లావాదేవీల వల్ల ప్రపంచంలో మేటి దేశంగా భారతదేశం నిలిచిందన్నారు. భారతీయ ఆవిష్కరణలను ఆయన విపులంగా వివరించారు. స్థానిక పరిష్కారాలను గ్లోబల్ సొల్యూషన్స్‌గా మార్చడానికి స్కేలింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఐఎస్ఎస్ఏ అధ్యక్షుడు అసుతోష్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక స్వభావాన్ని పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. అప్పుడే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగలమన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూఎఫ్ఈ వ్యవస్థాపకురాలు డా.రూపావాసుదేవన్, చైర్మన్ భరత్ లాల్‌మీనా తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్ల ఆపరేషన్లపై వైద్యులకు అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

**ఎంవీపీకాలనీ:** మోకాళ్ల ఆపరేషన్లపై వైద్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండియన్ ఆర్థ్రోస్కోపీ సొసైటీ (ఐఏఎస్) ఆధ్వర్యంలో నగరంలోని నోవొటెల్ హోటల్లో 'ఐఏఎస్ వన్ మోకాళ్ల ఆర్థ్రోస్కోపీ' సదస్సు జరిగినట్లు మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం తెలిపింది. ఈ సదస్సులో నిపుణులైన డాక్టర్లు సందీప్ బిరారిస్ (ముంబై), రాజీవ్ రామన్ (కోల్‌కతా), ముకేశ్ లడ్డా (నాగపూర్), చిరాగ్ తోశే (బెంగళూరు)లు ఏసీఎల్, పీసీఎల్ మెనిస్కు, మల్టీలిగమెంట్ మోకాళ్ల సర్జరీ విధానాన్ని వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 5 విభాగాలుగా విభజించి నిర్వహించిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది ఆర్థోపెడిక్ వైద్యులతోపాటు ఎన్.పద్మజ, అడ్మినిస్ట్రేషన్ సెంట్రల్ హెడ్ డాక్టర్ శ్రీధర్, ఐఏఎస్ ప్రతినిధులు డాక్టర్ సచిన్ తపస్వి, డాక్టర్ సందీప్ బిరారిస్, డాక్టర్ పి.శివానంద, డాక్టర్ శ్రీధర్ గంగవరపు తదితరులు పాల్గొన్నారు.

### మన్‌కీ బాత్‌లో బీజేపీ శ్రేణులు

**సాక్షి, విశాఖపట్నం:** ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయా ప్రాంతాల నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. నగరంలోని రాజస్థానీ సాంస్కృతిక మండలిలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ ఓబీసీ విభాగం నేతలు ఏర్పాట్లు చేశారు. మన్‌కీ బాత్ అనంతరం విశాఖలో బీసీ కుల పెద్దలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్, ఓబీసీ జాతీయ కార్యదర్శి పార్థసారథి, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వెటరన్ ఫుట్‌బాల్ విజేత గోవా

**విశాఖ స్పోర్ట్స్:** సూపర్ సీనియర్స్ కప్ ఫుట్‌బాల్ పోటీల్లో గోవా జట్టు విజేతగా నిలిచింది. రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన లీగ్ తుది మ్యాచ్‌లో గోవాతో తలపడిన స్థానిక విశాఖ వెటరన్ జట్టు 1-1 గోల్స్‌తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ పోటీల్లో అత్యధిక పాయింట్లు సాధించిన గోవా విజేతగా నిలవగా తర్వాత స్థానంలో విశాఖ వెటరన్ జట్టు నిలిచింది. రెండు రోజుల పాటు ఈ పోటీలు లీగ్ పద్ధతిలో నిర్వహించగా గోవా, చెన్నై, కేరళ, తెలంగాణా, హైదరాబాద్ వెటరన్ జట్లతో పాటు స్థానిక విశాఖ వెటరన్ జట్టు పోటీపడింది.

## శిక్షణార్థులకు స్కేటింగ్ పోటీలు



స్కేటింగ్‌లో విజేతలతో నిర్వాహకులు

**విశాఖ స్పోర్ట్స్:** వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్కేటింగ్‌లో శిక్షణ పొందిన వారికి పోటీలు నిర్వహించారు. ఈకోర్‌రైల్వే వాల్తేర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం రెండు నెలల పాటు జరిగింది. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ శిబిరంలో పాల్గొనగా... కొందరు పోటీల్లోనూ సత్తా చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ భాటి హాజరై విజేతలకు బహుమతులందించారు.

## బీసీ జనగణనకు కమిటీపై హర్షం



ఫిషింగ్ హార్బర్‌లో జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కోలా గురువులు

**మహారాణిపేట :** రాష్ట్రంలోని బీసీ కులాల జనగణన అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిన నేపథ్యంలో ఫిషింగ్ హార్బర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ బీసీ కులజనగణన జరగడం ద్వారా జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు, రాజకీయ ప్రాధాన్యత దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా మత్స్యకార సంఘాల నాయకులు మూగి శ్రీరాములు, మోసా రాజు, చీకటి శ్రీరాములు, విశాఖ జిల్లా మత్స్యకార సంఘాల నాయకులు కొమర అప్పలరాజు, తోట నూకరాజు, తాతా బాబు, డి. అప్పారావు, కోలా స్వామి, బోటు యాజమానులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.



**తీరంలో నాట్య మయూరి**

రాడిసిన్ బ్లూ హోటల్‌లో ఆదివారం జరిగిన ఓ సదస్సులో కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చేందుకు వచ్చిన సీతమ్మధారకు చెందిన తేజశ్రీ రుషికొండ తీరంలో ప్రాక్టీస్ చేస్తుండగా సాక్షి క్లిక్‌మనిపించింది.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## పగలు ఎండ.. సాయంత్రం ఠండా!

పగలంతా ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండ వేడిమికి అవస్థలు పడ్డారు. చెమట ధాటికి తడిసి ముద్దయ్యారు. చల్లని గాలుల కోసం పరితపించారు. అందుకు తగ్గట్టే సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. చల్లగాలులూ వీచాయి. ఆ వెంటనే నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కూడా కురిశాయి. దీంతో హాయి గొలిపే వాతావరణం నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచింది. అప్పటివరకు ఉష్ణతాపం, ఉక్కపోతతో సతమతమైన వీరికి ఎంతో ఊరట లభించింది.



మండుటెండలో..



వర్షపు జల్లులో..



కమ్ముకున్న నీలి మేఘాలు